# మైనార్టీల సంక్షేమానికి సీఎం కృషి

**● మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి**

చిన్నశంకరంపేట/మెదక్ అర్బన్/మెదక్ రూరల్, అక్టోబర్ 8: మైనార్టీల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఎమ్మెల్యే నివాస గృహంలో మండల పరిధిలోని భాగీర్థిపల్లి గ్రామంలో కబ్రిస్థాన్ ప్రహరీ నిర్మాణానికి మంజూరైన రూ.10 లక్షల ప్రొసీడింగ్ కాపీని గ్రామ సర్పంచ్ దయానంద్ యాదవ్‌కు ఎమ్మెల్యే అందజేశారు. భాగీర్థిపల్లిలే గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి స్థలాన్ని ఇచ్చిన ముస్లిం పెద్దలను ఆమె అభినందించారు. గ్రామ అభివృద్ధికి కుల మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేస్తున్నారని తెలిపారు. గ్రామాభివృద్ధికి తనవంతు సహకారాన్ని అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు నాగరాజు, లక్ష్మణ్, సింగిల్‌విండో చైర్మన్ సత్యనారాయణ, ఉప సర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు చంద్రం, దుర్గపతి, నరసింహారెడ్డి, రాములు, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.



సర్పంచ్ దయానంద్ యాదవ్‌కు ప్రొసీడింగ్ కాపీని అందిస్తున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

### పద్మశాలీల సంక్షేమానికి ప్రాధాన్యం

☛ పద్మశాలీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. మెదక్ మున్సిపాలిటీ పరిధిలోని ఔరంగాబాద్‌లో ఆదివారం పద్మశాలి సాముహిక భవనాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గత ప్రభుత్వాలు కులవృత్తులను విస్మరించారని, బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని కులాలకు సమ ప్రాధాన్యతనిస్తూ సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, మెదక్ వ్యవసాయ మార్కెట్‌కమిటీ అధ్యక్షుడు జగపతి, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

### అంతిమయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే

☛ మెదక్ మండల పరిధిలోని నేరురూ గ్రామానికి చెందిన విద్యార్థి భరత్ సింహరెడ్డి హైదరాబాద్‌లోని కళాశాలలో ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. విషమం తెలుసుకున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ఆదివారం మృతిని స్వగ్రామానికి వెళ్లి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించి, అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే వెంట జడ్పీవైస్ చైర్‌పర్సన్ లావణ్యారెడ్డి, సర్పంచ్ జానకీరాంరెడ్డి నాయకులు నర్సింలు తదితరులు ఉన్నారు.



పేరురూలో అంతిమయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జిల్లా స్కూల్ గేమ్స్ ప్రధాన కార్యదర్శి రమేశ్

## రాష్ట్ర స్థాయిలోనూ విజయం సాధించాలి

**● జిల్లా స్కూల్ గేమ్స్ ప్రధాన కార్యదర్శి గంగాల రమేశ్**

నర్సాపూర్, అక్టోబర్8: విద్యార్థులు, యువకులు క్రీడల్లో పాల్గొని శారీరక, మానసిక ధృఢత్వాన్ని పెంపొందించుకోవాలని జిల్లా స్కూల్ గేమ్స్ ప్రధాన కార్యదర్శి గంగాల రమేశ్ పేర్కొన్నారు. ఆదివారం నర్సాపూర్ పట్టణ సమీపంలోని 'గిరిజన గురుకుల సాఫ్ట్ బాల్ అకాడమీ' మైదానంలో జరిగిన మెదక్ జిల్లా పురుషుల సాఫ్ట్ బాల్ ఎంపికకు ముఖ్య అతిథిగా రమేశ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించే 2 శాతం కోటాను వినియోగించుకొని విద్యా, ఉద్యోగాలలో రాణించాలని ఆకాంక్షించారు. క్రీడల్లో మంచి ప్రతిభ కనభరిచి రాష్ట్ర స్థాయి పోటీలలో విజయం సాధించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అజయ్‌కుమార్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి శ్యామ్ సుందర్‌శర్మ, కోశాధికారి గోవర్ధన్ గౌడ్, గిరిజన గురుకుల ప్రాంతీయ క్రీడా కో–ఆర్డినేటర్ సుజాత, వ్యాయామ ఉపాధ్యాయులు రాజు, యాసిన్, రేవంత్, కోచ్ షానవాజ్ పాల్గొన్నారు.



సభకు వెళ్తున్న సుతారిపల్లి ముదిరాజులు

## హక్కుల కోసం పోరాటం

రామాయంపేట రూరల్, అక్టోబర్8: ముదిరాజ ఐక్యవేదిక ఆధ్వర్యంలో పార్టీలకు అతీతంగా ఆదివారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న ముదిరాజ్‌ల ఆత్మగౌరవ సభకు రామాయంపేట మండలం సుతారిపల్లి గ్రామ ముదిరాజ్ సంఘం నాయకులు తరలివెళ్లారు. పార్టీలకు అతీతంగా నిర్వహిస్తున్న సభకు వెళ్లాల్సిన బాధ్యత ప్రతి ముదిరాజ్‌కు ఉందన్నారు. తాం ఏ పార్టీకి వ్యతిరేకం కాదని ముదిరాజ్‌లకు దక్కాల్సిన పదవులు హక్కుల కోసం పోరాటం చేస్తున్నామని స్పష్టం చేశారు.

# త్వరలో శ్రీగురుపీఠం నిర్మాణానికి భూమిపూజ

**● హైకోర్టు సీనియర్ న్యాయవాది శివకుమార్‌గౌడ్**



శ్రీగురుపీఠం బాలాలయంలో పూజల్లో హైకోర్టు సీనియర్ న్యాయవాది శివకుమార్‌గౌడ్

శివ్వంపేట, అక్టోబర్ 8: శివ్వంపేట మండలం గూడూరులో శ్రీగురుపీఠం బాలాలయంలో ఆదివారం హైకోర్టు సీనియర్ న్యాయవాది, శ్రీగురుపీఠం చైర్మన్ జిన్నారం పెద్దగౌని శివకుమార్‌గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీగురుపాదుక పూజ గురుస్తోత్రంతో పాటు శ్రీసాయినాథ స్వామికి అర్చనలు చేసి హారతి ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే శ్రీగురుపీఠం నిర్మాణ భూమిపూజ నిర్వహించడం జరుగుతున్నదని తెలిపారు. ఈ నెల 16 శ్రీగురుపీఠం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ట్రస్టు ఎండి శాస్త్రుల వెంకటేశ్వరశర్మ మార్గదర్శకంలో గ్రామంలోని శ్రీసాయి బాలాలయం నుంచి శ్రీశిరిడి సాయిబాబా, విశ్వంజి మహరాజ్ ఫొటోలను సాయి భక్తబృంధంతో శ్రీగురుపీఠం బాలాలయానికి ఊరేగింపుగా తీసుకెళ్లి ప్రతిష్ఠించడం జరుగుతుందన్నారు. అనంతరం హారతి నిర్వహించి భక్తులకు అన్నదానం చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ స్వరాజ్యలక్ష్మిశ్రీనివాస్‌గౌడ్, ట్రస్టు సభ్యులు సూర్యకుమార్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

### ఆలయ నిర్మాణానికి సహకారం అందిస్తా..

యాదవసంఘం ఆధ్వర్యంలో మల్లన్న భ్రమరాంబదేవి సహిత దేవాలయ నిర్మాణానికి తనవంతు సహకారం తప్పకుండా అందిస్తానని గ్రామానికి చెందిన హైకోర్టు సీనియర్ న్యాయవాది జిన్నారం పెద్దగౌని శివకుమార్‌గౌడ్ అన్నారు. ఈమేరకు ఆదివారం శివకుమార్‌గౌడ్‌కు యాదవసంఘం సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ స్వరాజ్యలక్ష్మిశ్రీనివాస్‌గౌడ్, రాజ్యం భిక్షపతియాదవ్, గొల్ల యాదగిరి, యాదవ సంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



కూలిన పెంకుటిల్లును పరిశీలిస్తున్న సర్పంచ్ సుగుణశ్రీనివాస్, ఆర్‌ఐ కిషన్

## కూలిన శిథిలావస్థ ఇల్లు

శివ్వంపేట, అక్టోబర్ 8: శిథిలావస్థకు చేరిన ఓ పెంకుటిల్లు కూలి మహిళకు గాయాలైన ఘటన శివ్వంపేట మండలం అల్లీపూర్‌లో జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తలారి లక్ష్మి భర్త కొన్ని రోజులు క్రితం మృతిచెందడంతో తన పెంకుటింట్లో జీవనం సాగిస్తుంది. ఆదివారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో శిథిలావస్థకు చేరిన పెంకుటిల్లు ఒక్కసారిగా కూలడంతో ఇంట్లో నిద్రిస్తున్న లక్ష్మి శిథిలాలకింద చిక్కుకుంది. చుట్టుపక్కల గమనించిన లక్ష్మిని బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు. రెవెన్యూ అధికారులు ఆర్‌ఐ కిషన్, సర్పంచ్ పిట్ల సుగుణశ్రీనివాస్ ఇంటిని సందర్శించి వివరాలు అడిగి తెలుసుకుని, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

## కార్యకర్త మృతి.. ఎమ్మెల్యే ఆర్థిక సాయం



దత్తు (ఫైల్)

రామాయంపేట, అక్టోబర్ 8: మండలంలోని అక్కన్నపేటలో ఆదివారం తెల్లవారు జామున బీఆర్‌ఎస్ కార్యకర్త చందిన దత్తు(50) గుండెపోటుతో మృతిచెందాడు. బీఆర్‌ఎస్ శ్రేణులు విషయం ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో బాధిత కుటుంబానికి రూ.10 వేల నగదును గ్రామ బీఆర్‌ఎస్ నాయకుడు చిట్టిమల్లి నరేందర్‌రెడ్డి, నాయకులు అందజేశారు. మృతుడు గతంలో వార్డు సభ్యుడిగా పనిచేసినట్లు నరేందర్‌రెడ్డి తెలిపారు.

## వ్యక్తి ఆత్మహత్య

చిన్నశంకరంపేట, అక్టోబర్ 8: డబ్బులు విషయంలో గొడవపడి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చిన్నశంకరంపేటలో శనివారం రాత్రి జరిగింది. చిన్నశంకరంపేట ఎస్సై నారాయణ కథనం ప్రకారం.. చిన్నశంకరంపేటకు చెందిన కుమ్మరి శంకర్ (38) డబ్బుల విషయంలో అన్నదమ్ములు గొడవపడి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతిని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వెల్లడించారు.

# ముదిరాజ్‌లకు ప్రాధాన్యతనివ్వాలి



హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన ముదిరాజులు ఆత్మగౌరవ సభకు నిజాంపేట నుంచి అధిక సంఖ్యలో ముదిరాజులు బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో ముదిరాజ్‌లు పోచయ్య, సత్యం, స్వామి, బాబు, రవి



హైదరాబాద్ ఆత్మగౌరవ సభకు తరలివెళ్తున్న ముదిరాజులు

కొల్చారం/రామాయంపేట/నిజాంపేట, అక్టోబర్ 8: అన్ని రాజకీయ పార్టీలు ముదిరాజ్‌లకు అన్యాయం చేస్తున్నాయని, జనాభాప్రాతిపదికన సీట్లు కేటాయించాలని ముదిరాజ్ సంఘం జిల్లా నాయకుడు ముత్యంగాని సంతోశ్‌కుమార్ డిమాండ్ చేశారు. సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించిన ముదిరాజ్ మహాసభకు మండల వ్యాప్తంగా పెద్ద ఎత్తున ముదిరాజ్‌లు తరలివెళ్లారు. ఈ సందర్భంగా సంతోశ్ కుమార్ మాట్లాడుతూ ముదిరాజ్ మహాసభ విషయమై ఎలాంటి ప్రచారం చేయకున్నా సోషల్ మీడియాలో చూసి స్వచ్ఛందంగా ముదిరాజ్‌లు తరలిరావడం జరిగిందన్నారు. రాజ్యాధికారంతోనే సమానత్వం లభిస్తుందన్నారు. జనాభాలో అత్యధికంగా ఉన్న ముదిరాజ్‌లకు ఏ రాజకీయ పార్టీ అయిన తగినన్ని సీట్లు కేటాయించాలని డిమాండు చేశారు. ముదిరాజ్‌లకు దక్కాల్సిన పదవులు హక్కుల కోసం తాము పోరాటం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు రమేశ్, ధన్‌రాజ్, బాల్‌రాజ్, తిమ్మక్కపల్లి గోపాల్, నర్సింహులు, వెంకటాపూర్ సర్పంచ్ నెల్లి కిష్టయ్యలతో పాటు పెద్ద సంఖ్యలో ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

### జనాభా ప్రాతిపదికన..

రాష్ట్ర వ్యాప్తంగా ముదిరాజులకు అన్ని పార్టీలు అసెంబ్లీ సీట్లలో జనాభా ప్రాతిపదికన సీట్లను కేటాయించాలని డిమాండ్ చేస్తూ.. ఆదివారం రామాయంపేట నుంచి హైదరాబాద్‌కు ఆత్మగౌరవ సభకు తరలివెళ్లారు. రాష్ట్రంలో ముదిరాజ్‌ల సంఖ్య గణనీయంగా ఉందని అసెంబ్లీ సీట్లలో తమకే ప్రాధాన్యత కల్పించాలని అన్ని పార్టీలకు విజ్ఞప్తి చేశారు.